సమాచారం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 53, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 32, పందిరిబీర 42, క్యాబేజీ 10, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 28, దోసకాయ 33, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 31, చామగడ్డ 50, మొరంగడ్డ 26, కందగడ్డ 23, సొరకాయ 13, పొట్లకాయ 10, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

నేడు గురుగోవింద్ సింగ్ జయంత్యుత్సవాలు

రాంగోపాల్‌పేట్: సిక్కుల మత గురువైన గురు గోవింద్ సింగ్ జీ 356వ జయంత్యుత్సవాలను ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ సికింద్రాబాద్ అధ్యక్షులు బల్దేవ్‌సింగ్ బగ్గా, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ సింగ్ తెలిపారు. బాలంరాయిలోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు విశాల్ దివాన్ కార్యక్రమం జరుగుతుందని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సిక్కులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. అలాగే గుర్బానీ కీర్తనలు, ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన సిక్కు మత గురువుల ఆధ్వర్యంలో రాగిజాత, షాబాద్ కీర్తనలు ఆలపిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు ఉంటాయన్నారు. అమృత్‌సర్‌కు చెందిన మత గురువులు భాయ్ కమల్‌జీత్ సింగ్, సికింద్రాబాద్ గురుద్వారాకు చెందిన గ్యాని జగ్‌దేవ్ సింగ్, చరణ్‌జీత్ సింగ్‌లు పాల్గొంటారని తెలిపారు.

ఓయూ ప్రీ పీహెచ్‌డీ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో డిసెంబరులో జరిగిన వివిధ సబ్జెక్టుల ప్రీ పీహెచ్‌డీ కోర్సుల పరీక్షా ఫలితాలను శనివారం ప్రకటించారు. ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ప్రవేశాలకు ప్రత్యేక షెడ్యూల్

లాలాపేట: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2022–23 విద్యా సంవత్సరానికి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించినట్లు లాలాపేట శ్రీ దుర్గా హైస్కూల్లోని ఓపెన్ స్కూల్ సెంటర్ నిర్వాహకులు ఎం. నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ లేదా శ్రీ దుర్గా హైస్కూల్‌లో నేరుగా సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

డీజీపీని కలిసిన బాలయ్య


డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న దాసరి బాలయ్య

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ను హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య శనివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది రికార్డు స్థాయిలో 6.59 లక్షల పాస్‌పోర్టులను హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అందించేందుకు పోలీసు శాఖ అందించిన సహకారానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రెండు శాఖలు సమన్వయంతో ఈ కొత్త ఏడాది కూడా పాస్‌పోర్టు దరఖాస్తులకు మరింత అత్యుత్తమ సేవలను అందించాలని అభిప్రాయపడ్డారు.

సీడీ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట శనివారం సినీ దర్శకులు ఎన్.శంకర్ ఎన్‌కౌంట్ పాటల సీడీని ఆవిష్కరించి మాట్లాడారు. పాటలను అవని శ్రీ రచించగా, చుక్క రామనర్సయ్య, లాయర్ అశోక్, భవని, శేఖర్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షీలారాణి సైమన్‌కు డాక్టరేట్



లాలాపేట: హైదరాబాద్ నగరానికి చెందిన బి.షీలారాణి సైమన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్‌లో పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ నిజాం కళాశాల ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మెలిస్సా హెలెన్ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ ఇండస్ట్రీ నీడ్స్ అండ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ సిలబస్ ఆఫ్ సెలెక్టెడ్ ఇంజనీరింగ్ కాలేజెస్ ఇన్ ద తెలంగాణ స్టేట్' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో డాక్టరేట్‌తో సత్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

స్టాళ్లు నిర్మించారు.. కేటాయింపు మరిచారు!



సనత్‌నగర్: చిరు వ్యాపారులకు ఊతంగా నిలబడటంతో పాటు మరోవైపు స్థానికులకు అవసరమైన కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసరాలను ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో స్టాళ్లను నిర్మించారు. సనత్‌నగర్ డివిజన్‌లో ఇండస్ట్రియల్ పార్కు వద్ద, అమీర్‌పేట డివిజన్‌లో బల్కంపేట రోడ్డులోని ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద దాదాపు 40 వరకు స్టాళ్ల నిర్మాణం జరిపారు. చిరువ్యాపారులు కూడా ఇదేదో బాగుంది తాము అమ్ముకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావించారు. ఆయా ప్రాంతాల్లో దాదాపు రూ.15 లక్షల వరకు వెచ్చించి నిర్మించారు. కానీ.. వాటిని కేటాయించడంలో కాలాయాపన చేస్తుండంతో అవి వినియోగంలోకి రాకుండా దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. నూతన హంగులను స్టాళ్ల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అంగడిని తలపించేలా బొమ్మలు, కొనుగోలుదారులు తమ వాహనాలను పార్కు చేసుకునేందుకు వీలుగా ప్రధాన రోడ్డుకు అనుసంధానం చేస్తూ సిమెంట్‌తో ప్లాట్‌ఫాం సైతం నిర్మించారు. స్టాళ్ల నిర్మాణంలో చూపిన చొరవ కేటాయింపులో ఎందుకు లేదో అర్థమవ్వడంతో లేదని వ్యాపారులు, స్థానికులు చర్చించుకుంటున్నారు. స్టాళ్లను కేటాయించక పోవడంతో వాటిముందు భారీగా వాహనాల పార్కింగ్‌తో పాటు మరికొందరు ఇతరత్రా వ్యాపారాలు చేసుకుంటున్నారు.

వ్యాపారాలిలా.. ప్రయాణికులు నిలిచేదెలా?

లాలాపేట: లాలాపేట జయశంకర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ చుట్టూ కూరగాయాలు, వివిధ రకాల ఆహార పదార్థాలు విక్రయిస్తుండటంతో ఓ చిన్నపాటి మార్కెట్‌ను తలపిస్తోంది. బస్టాండ్ మొదలుకొని దాదాపు రోడ్డుపై వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో బస్సుల కోసం వేచి ఉంటున్న ప్రయాణికులు నడిరోడ్డుపై నిలబడాల్సిన దుస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. దీంతో తరచుగా లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ప్రతి మంగళవారం లాలాపేటలో జరిగే వారాంతపు సంతతో సమస్య మరింత జఠిలంగా మారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తున్న ఆక్రమణలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



'జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ ప్రాంతాన్ని విలీనం చేస్తే సమస్యలే'


మాట్లాడుతున్న రామకృష్ణ

రసూల్‌పురా: జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ ప్రాంతాన్ని విలీనం చేయడంతో ఇక్కడి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం క్లాసిక్ గార్డెన్‌లో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో కార్మికులు, ఉద్యోగులకు సక్రమంగా జీతాలు అందడం లేదని, కౌన్సిల్ సమావేశం ఎప్పుడు జరుగుతుందో మేయర్‌కే తెలియదని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్ని విలీనం చేసే విషయమై పలు కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. విలీన అంశంపై బీజేపీ ప్రజాభిప్రాయ సేకరణ చేసి పార్టీ అధిష్ఠానానికి నివేదిక అందజేస్తామన్నారు. పశ్చిమ, ఈశాన్య రాష్ట్రాల్లోని కంటోన్మెంట్ బోర్డుల్లో నిబంధనలు కఠినంగా ఉన్నందున విలీన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని కానీ.. టీఆర్‌ఎస్ నేతలు తామే సాధించినట్టుగా ప్రగల్భాలు పలుకుతున్నారని ఇది వారి అవివేకమని రామకృష్ణ విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, దయానంద్, శ్రీకాంత్, స్వరూప, అనురాద, వినోద, భాగ్యలక్ష్మి, మమత

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న సుషాంత్ పండా

అడ్డగుట్ట: నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఇండియన్ రైల్వేమెన్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ సమితి జాతీయ అధ్యక్షులు సుషాంత్ పండా పేర్కొన్నారు. సౌత్ లాలాగూడలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఐఆర్‌ఎంటీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ పెన్షన్ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత పెన్షన్ విధానంపై మొగ్గు చూపుతున్న కొన్ని రాష్ట్రాలను ఆర్థికభారం పేరుతో మోదీ ప్రభుత్వం అడ్డుకోవాలని చూస్తుందన్నారు. ప్రజా ప్రతినిధుల పేరుతో రాజకీయ నాయకులు రూ.లక్షల్లో పెన్షన్లు తీసుకుంటే ఆర్థిక భారం కావడం లేదా అని ప్రశ్నించారు. అనంతరం ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడారు. అన్ని యూనియన్లు సమన్వయంతో పోరాడితే పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ సాధ్యమవుతుందన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరకణకు కార్మికులు చేసే పోరాటానికి ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ తరుపున మద్దతు ఇస్తామని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అరవింద్ వెల్లడించారు. ఈ సదస్సులో ఐఆర్ ఎంటీపీఎస్ దక్షిణ మధ్య రైల్వే నాయకులు డేనియల్, సంతోష్, అమిత్ మాలంగి, మీడియా సెక్రటరీ భిక్షపతి గౌడ్, నాయకులు తారక్, నర్సింగ్, రాధాకృష్ణ, రాజ్‌కుమార్, జగదీష్, వినయ్, శ్రీధర్, కృష్ణ, శశి, పాండు, ప్రసాద్ పాల్గొన్నారు.


హాజరైన రైల్వే ఉద్యోగులు, కార్మికులు

సీవరేజ్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో కొనసాగుతున్న సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సామల హేమ సూచించారు. జలమండలి శ్రీనివాసనగర్ సెక్షన్ కార్యాలయంలో డీజీఎం కృష్ణ, ఇతర అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చిలకలగూడ, కింది బస్తీ, మహ్మద్‌గూడ ప్రాంతాల్లో మంజూరైన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి కొనసాగుతున్న అభివృద్ధి, పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సెక్షన్ మేనేజర్లు నవ్య, అన్విత్, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


మర్రి శశిధర్‌రెడ్డితో నర్సింగరావు

సనత్‌నగర్: టీఆర్‌ఎస్ సర్కార్‌ను ఇంటికి సాగనంపడం బీజేపీతోనే సాధ్యపడుతుందని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నర్సింగ్‌రావు శనివారం తన అనుచరులతో కలిసి మర్రి శశిధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తూనే రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నర్సింగరావు బీజేపీలోకి రావడం శుభపరిణామం అన్నారు.

పెరిక నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పంజగుట్ట: ఖైరతాబాద్‌లోని పెరిక విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో పెరిక కుల నిరుద్యోగులకు ఎస్‌ఐ, కానిస్టేబుల్, గ్రూప్–4 ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామని పెరిక విద్యార్థి వసతి గృహం ఉచిత కోచింగ్ ప్రోగ్రామ్ విభాగం కన్వీనర్ ఎడ్మ నర్సింగరావు తెలిపారు. శనివారం సోమాజిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దిల్‌సుఖ్‌నగర్, అశోక్ నగర్‌ల్లోని శ్రీరామానుజన్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ సహకారంతో ప్రముఖ విద్యావేత్త, వీరయ్య వర్మ నేతృత్వంలో ఈ నెల 9 నుంచి కోచింగ్ ప్రారంభమవుతుందన్నారు.ఎస్‌ఐ, కానిస్టేబుల్, గ్రూప్–4 ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే పెరిక కుల నిరుద్యోగ యువతకు రెండు నెలల పాటు ఉచిత ఇంటెన్సివ్ కోచింగ్ , నెలకు వెయ్యి రూపాయల ఉపకార వేతనం, ఉచిత మెటీరియల్ అందజేస్తామన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ ఎన్‌బీటీనగర్ ఎస్సీ (మాల) సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, నాగరాజుగౌడ్, తాళ్ల రాజు, రమేష్, నర్సింగ్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయం కానుకల పంపిణీ


కానుకలను పంపిణీ చేస్తున్న నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలను పంపిణీ చేశారు. శనివారం ఓయూ ఎస్టేట్ సెల్ ఆధ్వర్యంలో ఎల్లమ్మకు భక్తులు సమర్పించిన చీరలు, బియ్యాన్ని శనివారం పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు సంజయ్, వేణుగోపాల్, అవినాష్, శంకరయ్య, గోపాల్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్– లాలాగూడ రైల్వే స్టేషన్ల మార్గ మధ్యలోని పట్టాలపై సుమారు 45–50 వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు రంగు పంచ, తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు.

ప్రవాసి దివస్‌ను సంపన్న ఎన్‌ఆర్‌ఐ జాతరగా మార్చారు

పంజగుట్ట: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న 17వ ప్రవాసి భారతీయ దివస్ వేడుకల ఎజెండాలో గల్ఫ్ కార్మికుల సమస్యలకు చోటు దక్కలేదని సీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ గల్ఫ్ జేఏసీ శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మజ్దూర్ ప్రవాసి దివస్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రవాసి దివస్‌ను సంపన్న ఎన్‌ఆర్‌ఐల జాతరగా మార్చేస్తున్నారని, గరీబ్ గల్ఫ్ కార్మికులను విస్మరించడం సరికాదన్నారు. ప్రవాసి భారతీయ బీమా యోజన ప్రమాద బీమా పాలసీలో సహజ మరణం కూడా కవర్ అయ్యేలా ఇన్సూరెన్స్‌లోని నిబంధనలు సవరించాలన్నారు. హైదరాబాద్‌లో గల్ఫ్ దేశాల కాన్సులేట్లు ఏర్పాటు చేయాలని ఎన్‌ఆర్‌ఐలకు ఆన్‌లైన్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రవాసి దివస్‌లో గల్ఫ్ సమస్యలు చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, తెలంగాణ గల్ఫ్ కార్మికుల జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నమనేని శ్రీనివాసరావు

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి: కిషన్ రెడ్డి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనతో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని అధోగతి పట్టిస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. పద్మారావునగర్ కౌతాకామకోటి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన సనత్‌నగర్ నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలో బందీగా మారిపోయింద సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యానికి తిలోదకాలిస్తూ నియంత పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఓ వైపు భూముల ఆక్రమణ, లిక్కర్ మాఫియా కాంట్రాక్టర్లతో కలిసి కోట్లాది రూపాయలను దోపిడీ చేస్తున్న కల్వకంట్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తొమ్మిది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, నాయకులు శ్యాంసుందర్ గౌడ్, టి. రాజశేఖరరెడ్డి, మురళీధర్ యాదవ్, విజయ, శ్రీశైలం గౌడ్, ఉమేష్ ఖండేల్వాల్ పాల్గొన్నారు.

'మనఊరు–మన బడి'తో సర్కారు బడులకు మహర్దశ


విద్యాధికారులతో మాట్లాడుతున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: మనఊరు–మన బడి కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పిస్తుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. శనివారం మారెడుపల్లి మండల విద్యాధికారులతో తార్నాకలోని ఆమె కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా లాలాపేట విజయ డెయిరీ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పక్క భవనం కోసం స్థలం కేటాయించాలని అధికారులు డిప్యూటీ మేయర్‌ను కోరగా స్పందించిన ఆమె మారెడుపల్లి తహసీల్దార్‌తో మాట్లాడి తార్నాక ప్రాంతంలో భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని సూచించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, మారెడుపల్లి డిప్యూటీ ఈఓ బాలు నాయక్, హెచ్‌ఎంలు పవన్ రాజ్, ప్రతాప్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణం


పనులను ప్రారంభించిన కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రస్తుత జనాభాకు అనుగుణంగా సామర్థ్యం కలిగిన కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణం జరిపి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి అన్నారు. ఎస్‌ఆర్‌టీ కాలనీలోని డబుల్ క్వార్టర్స్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా పురాతన కాలం నాటి పైప్‌లైన్లను తొలగించి కొత్త లైన్ల నిర్మాణం జరుపుతున్నట్లు వెల్లడించారు. అలాగే మంచినీటి పైప్‌లైన్ల విషయంలో కూడా లీకేజీలు తలెత్తకుండా అవసరమైన చోట్ల కొత్త పైప్‌లైన్ల వేసి స్వచ్ఛమైన నీటిని అందిస్తామన్నారు. కార్పొరేటర్ వెంట కొలను బాల్‌రెడ్డి, ఉమానాథ్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, వాటర్ వర్క్స్ మేనేజర్ మౌనిక, సూపర్‌వైజర్ రవి ఉన్నారు.

ఉత్సాహంగా ఉడాన్ ఫెస్టివల్


వివిధ రకాల ఆటపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


గాలి పటాలు ఎగరవేస్తూ..

రాంగోపాల్‌పేట్: టీఎంఐ గ్రూపు ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులు కుటుంబాలతో కలిసి ఉడాన్ ఫెస్టివల్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్పీరోడ్‌లోని అశోక్ భూపాల్ చాంబర్స్‌లోని టీఎంఐ కార్పొరేటర్ కార్యాలయంలో ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆనందంగా గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఆట పాటలు, సంగీతం, నృత్యాలు, ఎయిర్ పిస్టల్ షూటింగ్ తదితర కార్యక్రమాలతో అలరించారు. టీఎంఐ ఫౌండేషన్ సహకారంతో కొనసాగుతున్న ఉధవ్ స్కూల్ పిల్లలు కూడా ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎంఐ గ్రూప్ చైర్మన్ టీ మురళీధరన్, సీఈవో రవి కృష్ణన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల కుటుంబ సభ్యులను కలుసుకోవడం, వారితో వినోదభరితమైన క్షణాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య బంధాన్ని మరింత పెంచుతాయన్నారు.

బూత్‌స్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలి


బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సందేశాన్ని వింటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చింతల

బంజారాహిల్స్: భారతీయ జనతా పార్టీ ఖైరతాబాద్ నియోజక వర్గం పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం శనివారం ఆనంద్‌నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ సమ్మేళనాన్ని ఉద్దేశించి వీడియో ద్వారా సందేశాన్నిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ఈ సమ్మేళనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు నియోజక వర్గ బూత్ కమిటీ సభ్యులతో పాటు నాయకులు పాల్గొన్నారు.